వైభవంగా ఏకాశీతి కలశ స్నపనం

యాగశాలలో విశేష హోమాలు నిర్వహిస్తున్న వానమామలై మఠం 31వ పీఠాధిపతి మధుర కవి రామానుజ జీయర్ స్వామి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 22 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణలో భాగంగా శనివారం విమాన అధిష్ఠాన పరివార విశేష హోమాలు, ఏకాశీతి కలశ స్నపనాలు ఘనంగా జరిగాయి. నిత్యారాధనల అనంతరం స్వామివారిని దివ్య మనోహరంగా అలంకరించి తిరువీధి సేవోత్సవాన్ని జరిపారు. యాగశాలలో ప్రవేశింపజేశారు. అనంతరం వానమామలై మఠం 31వ పీఠాధిపతి మధుర కవి రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో చతుస్థానార్చన నిర్వహించారు. ఏకాశీతి(81) కలశాలను స్థాపన చేసి వాటిలో సమస్త దేవతలను వారి ఆహ్వాన స్వరూప స్వభావాలను కలిగిన తత్వాలను ఆహ్వానించారు. నదీ జలాలు, ధాన్యోదకాలు, చిరుధాన్యాలు, సుగంధ, పరిమళద్రవ్యాలు నింపి ఆరాధన గావించారు. సాయంత్రం 6గంటలకు పలు హోమాలు చేపట్టారు. ఉత్సవమూర్తులకు తిరువీధి సేవ చేపట్టి ఆలయంలోకి వేంచేపు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణికులు పాల్గొన్నారు.

నేడు స్వర్ణగోపురం మహాకుంభాభిషేక సంప్రోక్షణ

- హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, రాష్ట్ర అధికారులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 22 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్య విమాన స్వర్ణగోపురం మహాకుంభాభిషేక సంప్రోక్షణ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 11:54 గంటలకు వానమామలై మఠం 31వ పీఠాధిపతి మధుర కవి రామానుజ జీయర్ పర్యవేక్షణలో మహాకుంభాభిషేక సంప్రోక్షణ నిర్వహిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా దివ్య విమాన స్వర్ణ గోపురాన్ని ఆవిష్కరించి స్వామివారికి అంకితమివ్వనున్నారు.

పలు దర్శనాలు నిలిపివేత

మహాకుంభాభిషేక సంప్రోక్షణలో భాగంగా ఆదివారం ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. స్వామివారి నిత్య తిరుకల్యాణోత్సవం, సువర్ణ పుష్పార్చన. ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఉదయం 9నుంచి కొండపైకి ప్రైవేట్ వాహనాలకు అనుమతి ఇవ్వడం లేదు. భక్తుల కోసం కొండపైకి 25 ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పటిష్ట చర్యలు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.

స్వర్ణగిరిలో కల్పవృక్ష వాహనంపై కొలువైన వేంకటేశ్వరుడు

కల్పవృక్ష వాహనంపై కొలువుదీరి ఆలయ తిరుమాడ వీధుల్లో విహరిస్తున్న స్వామివారు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి మహాక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం ఉదయం వేంకటేశ్వరస్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యారాధనలు పూర్తి చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ద్వారతోరణ పూజ నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. ఆలయంలోని యాగశాలలో చతుస్థానార్చన మూర్తి కుంభ హోమాలు నిర్వహించారు. అనంతరం ఇష్టి యాగశాలలో సకల శత్రు బాధలు, రోగ నివారణకు నరసింహ ఇష్టి హవనాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై కొలువుదీరి ఆలయ తిరుమాడ వీధుల్లో విహరించారు. భీమవరం గోవిందపీఠం పీఠాధిపతి త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వేంకటేశ్వరస్వామిని దర్శించి తమ దివ్య మంగళశాసనములను అనుగ్రహించారు. స్వామివారికి సింహాచలం వరాహ నరసింహస్వామి పట్టు వస్త్రాలను, శేష మాల చందనాన్ని సమర్పించారు.

పుస్తకాలు చదివితే తలెత్తుకొని ఎదుగుతారు

- జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య

మాట్లాడుతున్న జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 22 : విద్యార్థులందరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదువాలని, రోజూ సెల్‌ఫోన్ చూస్తే తలదించుకొని బతుకుతారని, పుస్తకాలు చదివితే తలెత్తుకొని ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సరస్వతి విద్యాలయం 21వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కారంగా ఉండాలని, తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, సమాజానికి ఉపయోగపడేలా ఎదుగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం వినోద, మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, చందర్‌గౌడ్, నగేశ్, మాజీ ఎంపీటీసీ కవిత, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

జిల్లా సమస్యలపై సీఎంకు బహిరంగ లేఖ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 : జిల్లాలో నెలకొన్న సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లేలా సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు శనివారం బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖలో జిల్లాలో మూసీ నది ప్రవహించే ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, మూసీ ప్రక్షాళనకు వెంటనే పూనుకోవాలని అన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగాల విషయంలో పలు ఆరోపణలు వచ్చాయని, 24 గంటల్లో అత్యవసర చికిత్స విధానం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఓపీ 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. రోగులను హైదరాబాద్‌కు పంపించకుండా అందులోనే చికిత్స చేసేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో లేని పరికరాలు సమకూర్చుటకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు.

యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోను పునరుద్ధరించి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, పలు జిల్లాల నుంచి వచ్చే బస్సులు డిపోలోనే నిలిపి నైట్‌హాల్ట్ అందుబాటులోకి తేవాలని కోరారు. యాదగిరిగుట్ట పట్టణాభివృద్ధికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని సదుపాయాలతో టౌన్‌హాల్‌ను నిర్మించాలన్నారు. భువనగిరి పట్టణంలో అర్హులైన 2వేల మందికి స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లేలా బహిరంగ లేఖ విడుదల చేసినట్లు శ్రీరాములు తెలిపారు.

గుట్ట నుంచి చార్మినార్‌కు బస్సు ఏర్పాటు చేయాలి

- స్టేట్ మైనార్టీ కో ఆర్డినేటర్ మహ్మద్ షరీఫ్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 22 : ప్రజల సౌకర్యార్థం యాదగిరిగుట్ట నుంచి చార్మినార్‌కు నేరుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని స్టేట్ మైనార్టీ కో ఆర్డినేటర్ మహ్మద్ షరీఫ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ యాదగిరిగుట్ట డిపో అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నిత్యం వేలాది మంది భువనగిరి నుంచి హైదరాబాద్ చార్మినార్‌కు వివిధ పనుల నిమిత్తం, శుభకార్యాలకు బట్టలు, నగలు, పలు రకాల వస్తువులను కొనుగోలు చేసేందుకు వెళ్తుంటారని తెలిపారు. భువనగిరి నుంచి ఉప్పల్ వరకు, అటు నుంచి చార్మినార్‌కు వెళ్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట నుంచి చార్మినార్ వరకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్‌గా యాదయ్య

ఉత్తర్వులు అందుకుంటున్న యాదయ్య

మోత్కూరు, ఫిబ్రవరి 22 : జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్‌గా మండలంలోని పాటిమట్లకు చెందిన కురి మేటి యాదయ్యను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ బుర్ర రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం మోత్కూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల హనుమకొండలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తనను నియమాకం చేశారని తెలిపారు. మానవ హక్కులకు భంగం కలుగకుండా, అవినీతి నిర్మూలన కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోల మహేశ్‌ను నియమించారన్నారు.

ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతరావు

విద్యార్థులతో పాఠం చదివిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్, ఫిబ్రవరి 22 : పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని పడమటి సోమారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. స్టాఫ్ ఎంత మంది.. సెలవులో ఎంత మంది వెళ్లారు.. విద్యార్థుల హాజరు సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏం వండుతున్నారని తెలుసుకొని వారికి మంచి భోజనం అందించాలని సూచించారు. న్యూట్రిషన్ భోజనం పెడితేనే విద్యార్థుల జ్ఞాపక శక్తి పెరిగి మంచిగా చదువుతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా పెంచాలని, విద్యార్థులకు డిజిటల్ క్లాసులో ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే వారిని ప్రభుత్వ బడికి వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయుడు రంగయ్యకు సూచనలు చేశారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ముగ్గురికి గాయాలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 : టాటా ఏస్ వాహనం బోల్తా పడడంతో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన భువనగిరి పట్టణ పరిధిలో శనివారం జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ సమీపంలోని జీడిమెట్ల నుంచి సిమెంట్ బిల్లల లోడ్‌తో టాటా ఏస్ వాహనం శనివారం పట్టణ పరిధిలోని రాయగిరికి వెళ్తుంది. పట్టణ పరిధిలోని టీచర్ కాలనీ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న బీహార్‌కు చెందిన కూలీ ముఖేశ్‌కు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో కూలీ సుకేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెండ్లి ఇష్టం లేదని యువకుడి ఆత్మహత్య

మహేశ్ (ఫైల్)

మోటకొండూర్, ఫిబ్రవరి 22 : కుటుంబ సభ్యులు తనకు ఇష్టంలేని పెండ్లి చేస్తున్నారని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన జటంగి కొమురయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు జటంగి మహేశ్(28) హైదరాబాద్‌లో కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కుటుంబ సభ్యులు మహేశ్‌కు వచ్చే నెల 2న వివాహం నిశ్చయించారు. ఈ పెండ్లి ఇష్టం లేని మహేశ్ శుక్రవారం రాత్రి ఇంట్లోని ఓ గదిలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుంభమేళాకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

- 11మందికి గాయాలు

మోటకొండూర్, ఫిబ్రవరి 22 : మండలంలోని చాడ గ్రామానికి చెందిన 11 మంది శివ భక్తులు ఈ నెల 17న తుఫాన్ వాహనంలో మహాకుంభమేళాకు వెళ్లారు. తిరిగి వస్తుండగా.. శుక్రవారం రాత్రి నిర్మల్ జిల్లాలో ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న డీసీఎంను తుఫాన్ వాహనం ఢీకొట్టి రోడ్డు పక్కన పడిపోయింది. దాంతో అందులో ప్రయాణిస్తున్న 11మందికి గాయాలయ్యాయి. గట్టయ్య, ఎల్లయ్య, మధుకు తీవ్ర గాయాలు కాగా, మల్గ బాలయ్య, కూరెళ్ల మురళి, సలేంద్ర గట్టయ్య, సలేంద్ర మల్లేశ్, బొంతి ఎల్లయ్య, మల్గ ఐలయ్య, మల్గ మధు, ముస్కు పెంటారెడ్డి, గుర్రాల మత్స్యగిరి, మల్గ శ్రీశైలం, జెక్క జనార్దన్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. వీరంతా హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

మొబైల్ ఫోన్ చోరీ చేసి నగదు కాజేశాడు

చౌటుప్పల్, ఫిబ్రవరి 22 : జేబులో నుంచి మొబైల్ ఫోన్ చోరీ చేసిన గుర్తు తెలియని దుండగుడు గూగుల్ పే ద్వారా బ్యాంక్ ఖాతాలోంచి నగదు కొట్టేశాడు. బాధితుడు శనివారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన ఏలె లక్ష్మీనారాయణ ఈ నెల 1న చౌటుప్పల్ బస్టాండ్‌లో మునుగోడు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. తర్వాత తన జేబును చూసుకోగా.. మొబైల్ ఫోన్ లేదు. సమీప వ్యక్తుల నుంచి ఫోన్ తీసుకొని తన నెంబర్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆ తర్వాత తన మొబైల్ ఫోన్‌లోని గూగుల్ పే ద్వారా మూడు దఫాలుగా ఖాతా నుంచి రూ.99వేలు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

దోశలో బొద్దింక

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 22 : పట్టణంలోని శ్రీమంజునాథ ఉడిపి హోటల్లో ఒకరు తింటున్న దోశలో బొద్దింక వచ్చింది. ఆ వ్యక్తి హోటల్ యజమానిని నిలదీయగా సర్ది చెప్పి పంపించారు. ఈ హోటల్లో గతంలో కూడా చట్నీలో వెంట్రుక వచ్చింది. సంబంధిత అధికారులు స్పందించి హోటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రేవంత్‌రెడ్డికి మహాకుంభాభిషేక సంప్రోక్షణలో పాల్గొనే అర్హత లేదు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

- యాదగిరిగుట్టలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే దమ్ము ఎవరికీ లేదు
- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 22 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్టను మహాద్భుతంగా తీర్చిదిద్దారని, దేవస్థానంలో ఆయన అనవాళ్లను చెరిపే దమ్ము ఎవరికీ లేదని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో మూడు సార్లు స్వామివారిని దర్శించుకొని ఆలయం అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించని రేవంత్‌రెడ్డికి స్వర్ణతాపడం మహాకుంభాభిషేక సంప్రోక్షణలో పాల్గొనే అర్హత లేదని మండిపడ్డారు. యాదగిరిగుట్టలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. స్వామివారి గర్భాలయ దివ్య విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయాలన్న కేసీఆర్ సంకల్పం నెరవేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. యాదగిరిగుట్ట చరిత్రలో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. మహాకుంభాభిషేక సంప్రోక్షణకు కేసీఆర్‌ను ఆహ్వానించేందుకు ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఎందుకు వెళ్లలేదో చెప్పాలన్నారు. ఆలయాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను ఆహ్వానించేందుకు ఈఓకు తీరికలేపోయిందా? అని ప్రశ్నించారు. ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విమాన గోపురం స్వర్ణతాపడానికి ఎంత మంది ఎన్ని విరాళాలిచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా స్పందిచకపోవడం దారుణమన్నారు. బంగారం కొనుగోలు చేసేందుకు ఒంటరిగా వెళ్లడంలో ఆంతర్యమేంటో చెప్పాలన్నారు. ఈఓ చేపడుతున్న తప్పుడు విధానాలను రాసిపెట్టుకుంటున్నామని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి ఇస్తామని హెచ్చరించారు. ఈఓ భాస్కర్‌రావును వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు పేరబోయిన సత్యనారాయణ, బాలరాజుగౌడ్, గంజి సూర్యనారాయణ, గడ్డం చంద్రం, కోన్యాల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మోదీ హయాంలో కార్పొరేట్ సంస్థలకు రాయితీలు పెరిగాయి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు చంద్రారెడ్డి

కందాల రంగారెడ్డి స్థూపానికి పూలమాల వేస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి

చౌటుప్పల్, ఫిబ్రవరి 22 : ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో కార్పొరేట్ సంస్థలకు రాయితీలు పెరిగాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డిబావి గ్రామంలో శనివారం నిర్వహించిన కందాల రంగారెడ్డి 40వ వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ రైతులు, కార్మికుల సమస్యలను పూర్తిగా విస్మరించారన్నారు. కేవలం కార్పొరేట్ ఉన్నతికే పని చేస్తున్నారని విమర్శించారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏకపక్షంగా వ్యవహరిస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ తమ చెప్పుచేతుల్లో ఉంచుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు పాషా, గడ్డం వెంకటేశ్, రాగీరు కిష్టయ్య, గోశిక కరుణాకర్, శివ పాల్గొన్నారు.

అక్రమంగా పట్టాలు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి


తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

గుండాల, ఫిబ్రవరి 22 : గుండాల రెవెన్యూ పరిధిలో అక్రమంగా పట్టాలు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నూనెగూడెం గ్రామానికి చెందిన రైతులు తాసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్ నీలిమకు వినతిపత్రం అందజేశారు. వారికి నాయకులు రాంరెడ్డి, వెంకన్న, నారాయణ, వెంకటేశ్ మద్దతు పలికారు. కార్యక్రమంలో అండెం నర్సిరెడ్డి, మద్దెపురం పరశురాములు, రమేశ్, సత్తయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, బాలమల్లు, మోష పాల్గొన్నారు.

సైనిక గ్రూప్‌నకు బెస్ట్ సోషల్ సర్వీస్ నేషనల్ అవార్డు

బెస్ట్ సోషల్ సర్వీస్ నేషనల్ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్న సైనిక గ్రూప్ సభ్యులు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 22 : నిరుపేద విద్యార్థులకు ఉచితంగా సేవలందిస్తున్నందుకుగాను సైనిక గ్రూప్‌నకు బెస్ట్ సోషల్ సర్వీస్ నేషనల్ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో శనివారం జరిగిన నేషనల్ అవార్డు కార్యక్రమంలో మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి, బీసీ కార్పొరేషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేరెళ్ల మల్యాద్రి పాల్గొని మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో త్రివిధ దళాల్లో ఆసక్తి గల నిరుపేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి కావాల్సిన స్టడీ మెటీరియల్ అందిస్తూ, మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తూ భారత సైన్యంలో వంద మందికి పైగా చేర్పించడం హర్షణీయమన్నారు. సైనిక వాట్సాప్ గ్రూప్ ద్వారా 8వేల మందికి ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ ఇచ్చి సైనిక ఉద్యోగాలకు తయారు చేయడాన్ని అభినందిస్తూ ఈ అవార్డు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ నిరుపేద విద్యార్థులకు చేయూత అందిస్తున్న సైనిక గ్రూప్ వ్యవస్థాపకులు లోకేశ్ ముదిరాజ్, ప్రసాద్ ముదిరాజ్, శివకుమార్ యాదవ్, సాయికుమార్ వారు అభినందించారు.

విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

- డీఈఓ సత్యనారాయణ

మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

బొమ్మలరామారం, ఫిబ్రవరి 22 : విద్యార్థులు నూతన పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మల్యాల కేజీబీవీ పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన యూనిఫైడ్ వే, జీఈ వెర్నోవా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం పునరుత్పాదక శక్తి వనరులు అంశంపై ప్రబోధ సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఇందులో బొమ్మలరామారం జడ్పీహెచ్ఎస్, టీఎస్ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థినులు పాల్గొని పోస్టర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మట్లాడుతూ సంప్రదాయేతర ఇంధన వనరులను వినియోగించడం వల్ల కాలుష్యం తగ్గడంతోపాటు పర్యావరణం మెరుగుపడుతుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి శాస్త్రవేత్తలుగా ఎదుగాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించినప్పుడే గమ్యాన్ని త్వరగా చేరకుంటారని తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ జిల్లా అధికారి శ్రీనివాస్, జిల్లా జెండర్ ఇక్వాలిటీ కో ఆర్డినేటర్ అనూరాధ, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, కేజీబీవీ ఎస్ఓ లక్ష్మి, జీహెచ్ఎం వరలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీమా, జీఈ వర్నోవా ప్రతినిధులు చంద్రకాంత్, భాను ప్రకాశ్, సుధాకర్, ఎఎపీసీ చైర్‌పర్సన్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిష్టయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

అమ్మనబోలులో కిష్టయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

మోటకొండూర్, ఫిబ్రవరి 22 : మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు క్యాసగల్ల కిష్టయ్య ఇటీవల మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శనివారం కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన జటంగి మహేశ్ మృతి చెందగా నివాళులర్పించారు. ఆమె వెంట మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, నాయకులు బీస కృష్ణంరాజు, ఎర్ర మల్లేశ్ యాదవ్, భిక్షపతి, లవన్‌రెడ్డి, వెంకటేశ్, రాంబాబు ఉన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ

అడ్డగూడూరులో నర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

అడ్డగూడూరు, ఫిబ్రవరి 22 : మండల కేంద్రానికి చెందిన బండ నర్సమ్మ, వడకాల కమలమ